క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు, ఎరువులు: ఏవో

కంచికచర్ల : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె. విజయకుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మాగాణిలో జీలుగు విత్తనాలు నాటాలని, పెరిగిన జీలుగును దున్ని వరి పంటను సాగుచేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రీయ ఎరువులను మాత్రమే వాడాలని, ముందుగా రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుంటే మేలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మొక్కజొన్న, పెసర, పత్తి విత్తనాలతోపాటు ఎరువులు, పురుగుమందులు కూడా అందుబాటులో ఉన్నాయని ఏవో వివరించారు.

వైభవంగా కల్యాణోత్సవం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఎదురుకోల ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు పరాంకుశం కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాలు సమర్పణ



కె.అగ్రహారం(జగ్గయ్యపేట): మండలంలోని కె.అగ్రహారం పాలేటి వద్ద వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. ప్రత్యేకంగా బోనాలు తయారుచేసి ప్రభ బండ్లు కట్టుకుని డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురవాలంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: నా నేస్తం మ్యూజికల్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తొలి కార్యక్రమంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన స్వర సినీ సంగీత విభావరి సీజన్–1 అలరించింది. నగరానికి చెందిన గాయనీ గాయకులు నాగభూషణం, నాయక్, నాగలక్ష్మి, షబానా, శ్రీను, బ్రహ్మం వెంకటేశ్వరరావు తదితరులు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించారు.

750 మందికి ఉచిత వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): పాయకాపురం విశాలాంధ్రకాలనీలోని ఎస్‌జీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో 750 మంది వైద్య పరీక్షలు చేశారు. సింగ్‌నగర్ ఫ్యామిలీ ఆస్పత్రి ఫిజీషియన్ డాక్టర్ సైరాభాను, వన్‌టౌన్‌లోని అయాన్ ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ బషీర్ అహ్మద్ మయూక్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాభాను.. వైద్య బృందం సాధారణ వ్యాధులు, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులు ఉన్న వారికి 426 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. పలువురికి 25 రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ బషీర్ అహ్మద్ 320 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాభాను దోమకాటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరపల్లి లక్ష్మీ రాజ్యపూర్ణ, అయాన్, ఫ్యామిలీ ఆస్పత్రుల గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు చికిత్స




జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

జగ్గయ్యపేట: డయేరియాతో బాధపడుతూ జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చేరుతున్న వారికి వైద్యసిబ్బంది చికిత్స అందిస్తున్నారు. డయేరియా బారినపడి నియోజకవర్గంలో ఇప్పటికే ఆరుగురు వ్యక్తులు మృత్యువాత పడగా, పలువురు జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. మూడురోజులుగా వాంతులు, విరోచనాలతో బాధపడుతూ 50మందికిపైగా ప్రభుత్వాసుపత్రిలో చేరగా వైద్యచికిత్స అనంతరం పలువురు డిశ్చార్జి అయ్యారు. ఆదివారం ఒక్కరోజే 11మంది డయేరియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరారు. ఇప్పటికే 32మంది చికిత్సపొందుతుండగా 12మంది డిశ్చార్జి అయినట్లు జగ్గయ్యపేట వైద్యులు తెలిపారు. డయేరియాతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన వారిలో చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)తో కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలందించాలని వైద్య సిబ్బందిని మంత్రి ఆదేశించారు.

మక్కపేటలో కొనసాగుతున్న వైద్యశిబిరం..

డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో వత్సవాయి మండలంలోని మక్కపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరం కొనసాగుతోంది. మక్కపేట, దేచుపాలెం మంగొల్లులో కలిపి ప్రస్తుతం మొత్తం ఆరుగురు వ్యక్తులు డయేరియాతో బాధపడుతున్నారు. మక్కపేట పాత పంచాయతీ భవనంలో వైద్యాధికారి హర్షితాబేగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం కొనసాగుతోంది. గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తూ, గ్రామస్తులకు పలురకాల వైద్యపరీక్షలు చేశారు. డయేరియా విజృంభించకుండా పంచాయతీ అధికారులు ముమ్మర పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. రోడ్లను శుభ్రం చేయించడంతోపాటు బ్లీచింగ్ చల్లించారు. పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో చైతన్య పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం



గ్రామంలో మంచినీటి బావి ప్రాంతంలో తోలిన చిప్స్‌మట్టి



ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు



జేసీబీతో చెత్తాచెదారాలను తొలగిస్తున్న సిబ్బంది

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): డయేరియా కేసులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో జగ్గయ్యపేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేటలో ఆదివారం పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేశారు. చెరువు వద్దగల మంచినీటి బావి చుట్టూతా బురదమయంగా ఉన్న ఆ ప్రాంతాన్ని చిప్స్ పౌడర్‌తో చదును చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. డయేరియా బాధితుల కోసం గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం కొనసాగుతోంది. గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సాంబశివరావుతోపాటు పలు గ్రామాల నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం మెరుగునకు చేపట్టిన పనులతోపాటు గ్రామంలో మంచినీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సిబ్బంది

వాటర్‌ట్యాంక్ పరిశీలన....

గ్రామంలోని మోడల్‌కాలనీలోని హెడ్‌వాటర్ ట్యాంక్‌ను వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్రమణ్యేశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ట్యాంక్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పరీక్షల నిమిత్తం తాగునీటిని ర్యాపిడ్ రెస్పాన్స్‌బుల్ టీం సిబ్బంది మరోసారి శాంపిల్స్ సేకరించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు కిక్కిరిశారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటం, మొక్కులు చెల్లించుకునేందుకు అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. దీంతో పెనుగంచిప్రోలు జనసంద్రంగా మారింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది వాహనాలు తరలిరావడంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం నగరాన్ని తలపించింది. ఆంధ్రా నుంచేగాక తెలంగాణ నుంచి కూడా వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తగు చర్యలు చేపట్టారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

వెండితాపడం పనులకు విరాళాలు




వెండితాపడం పనులకు విరాళాలు అందజేస్తున్న దాతలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని అంకమ్మవారి ఉపాలయం గోపురం వెండి తాపడం పనులకు ఆదివారం ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన వేగిచర్ల రవికుమార్, పద్మపావని దంపతులు రూ.10,111 ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. అదేజిల్లా గిద్దలూరుకు చెందిన నారాపురం రంగవిఠల్ రంగనాయకులు దంపతులు రూ.25,116లు విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

తిరునాళ్ల మహోత్సవం

నందిగామ: మండల కేంద్రమైన చందర్లపాడులో అలివేలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా భక్తులు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.



నిరుపేద చిన్నారులకు నిత్యావసరాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అనాథ, నిరుపేద చిన్నారులకు ఆదివారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, షఫీ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా నిరుపేద చిన్నారులకు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ వసంతకుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా నిరుపేద, అనాథ చిన్నారులకు ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

పక్షవాత బాధితుడి కుటుంబానికి..

భవానీపురం(విజయవాడపశ్చిమ): పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వ్యక్తి కుటుంబానికి దీవెన ఫౌండేషన్ రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేసింది. బీసెంట్‌రోడ్డులో రోడ్డు పక్కన కర్చీఫ్‌లు విక్రయిస్తూ జీవిస్తున్న జయరామ్ భార్య, నలుగురు పిల్లలతో కలిసి విజయవాడ కృష్ణలంకలో నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు కొన్ని నెలల క్రితం పక్షవాతం వచ్చి కాలు, చెయ్యి పని చేయకపోవడంతో మంచం మీదే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులు సాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరఫున గ్రూప్ సభ్యులు శరత్ కుమార్, కానిస్టేబుల్ నాగేంద్ర ఆదివారం వారి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు, డాక్టర్ హనుమయ్య అన్నారు. శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరిజైన్ శ్వేతాంబర్ ట్రస్ట్, శ్రీ సంభవనాథ్ జైన్ పరిషత్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యాన పాత బస్తీలోని ఆరాధన భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమయ్య మాట్లాడుతూ రక్తదానంపై సమాజంలో అనేక అపోహలు ఉన్నాయన్నారు. రక్తం సకాలంలో అందక లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. క్లబ్ ప్రముఖులు తేజీరోజా సోలంకి మాట్లాడుతూ 18 నుంచి 60ఏళ్లవయస్సు కలిగి, 50కిలోల కన్నా అధికంగా బరువు ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. ట్రస్ట్ ప్రముఖులు రాజేంద్రకుమార్ సోలంకి, సంపత్ కుమార్, సుజిత్‌కుమార్ సోలంకి, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితమే కారణం

మంత్రి సత్యకుమార్ యాదవ్



వైద్యశిబిరాన్ని సందర్శించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

మక్కపేట(వత్సవాయి): జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని ఆయా గ్రామాల్లో తాగునీరు కలుషితం కావడమే డయేరియా ప్రబలడానికి కారణమని భావిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వత్సవాయి మండలం మక్కపేటలో డయేరియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబుతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. అక్కడ వైద్యసిబ్బందితో మాట్లాడి పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. మక్కపేటకు చెందిన ముగ్గురు, మంగొల్లు, దేచుపాలెం నుంచి ఒక్కో డయేరియా కేసు వచ్చినట్లు వైద్య సిబ్బంది మంత్రికి తెలిపారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేదని మంత్రికి వివరించారు. గ్రామస్తులకు సరఫరా చేసే నీటి వివరాలతోపాటు నీటిశాంపిల్స్‌పై మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులను ఆరా తీశారు. పారిశుద్ధ్యం, తాగునీటి వసతులపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ పక్కన తాగునీటి పైపులైన్లు ఉండటంతో మురుగు నీరు పైపుల్లోకి వెళ్లి నీరు కలుషితం అవుతోందన్నారు. తాగునీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ చానళ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను సరిగా శుభ్రం చేయకపోవటం కూడా నీటి కలుషితానికి కారణమన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వైద్యసిబ్బంది, రోగులకు సరైన సేవలు అందిస్తున్నారన్నారు. డయేరియా బాధితులకు పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ కమిషనర్ డా.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ పి. సంపత్‌కుమార్, సర్పంచ్ మల్లెల శివ, అధికారులు పాల్గొన్నారు.


చినుకుతో ప్రారంభమైన ఖరీఫ్ సాగు



అడవిరావులపాడులో అచ్చు తోలుతున్న రైతు

నందిగామ: ఎట్టకేలకు జూన్ మూడోవారానికి వరుణుడు కాస్త కరుణించాడు. చినుకు పడటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పొలాలను సాగు కోసం సిద్ధం చేసి ఉంచిన రైతులు విత్తనాలు విత్తే పనుల్లో నిమగ్నమవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 34,483 హెక్టార్లలో సాగు భూమి ఉంది. ఆయా భూములను ఇప్పటికే రైతులు వేసవి దుక్కులు దున్ని ఖరీఫ్ సాగుకు సిద్ధం చేశారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నియోజకవర్గంలో ప్రధాన పంటగా పత్తి సాగు చేపట్టేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో గతేడాది 13,469 హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. ఈసారి కూడా అదేస్థాయిలో పత్తిసాగు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల రైతులు విత్తనాలు విత్తే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిగిలిన రైతులు సైతం విత్తనాలను కొనుగోలు చేసి పంటసాగుకు సమాయత్తమవుతుండటంతో నియోజకవర్గంలో వ్యవసాయపనులు ఊపందుకుంటున్నాయి.

కూలేందుకు సిద్ధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్



జయంతి గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్



ఇనుపచువ్వలు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్న ట్యాంకు పిల్లర్లు

జయంతి(వీరులపాడు): మండలంలోని జయంతి గ్రామంలో రక్షిత నీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. గ్రామంలో సుమారు 6వేల మంది జనాభాకు ఈ ట్యాంకు నుంచి మంచినీరు సరఫరా అవుతోంది. గ్రామంలోని మంచినీటి సరఫరా కోసం 1992లో పంచాయతీ కార్యాలయం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఈ ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఓవర్ హెడ్ ట్యాంక్ శ్లాబ్ పెచ్చులూడుతోంది. పిల్లర్లు సైతం దెబ్బతిని ఇనుపచువ్వలు బయటపడ్డాయి. దీంతో ఎప్పుడు ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



చిన్నారుల సంప్రదాయ వస్త్ర ప్రదర్శన

విజయవాడకల్చరల్: మురళీమోహన్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముద్రా నృత్య కళాకేంద్రం బాలికలు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. భో శివశంభో, అదివో అల్లదివో తదితర కీర్తనలకు నృత్యాలను అభినయించారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. మురళీమోహన్ కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు శేఖర్, మురళీ మోహన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు